# కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు



పారువెల్లలో ప్రచారానికి వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు పూలు చల్లి స్వాగతం పలుకుతున్న మహిళలు

- మోసపూరిత హామీలతో ఆగం కావొద్దు
- సీఎం కేసీఆర్‌తో అభివృద్ధి
- మరోసారి నన్ను ఆశీర్వదించండి
- బీఆర్‌ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పారువెల్ల ఆలయంలో ముడుపు కట్టి ప్రచారం ప్రారంభం

గన్నేరువరం, అక్టోబర్ 30: కాంగ్రెస్ మాయ మాటను నమ్మి మోసపోవద్దని, మోసపూరిత హామీలతో ఆగం కావొద్దని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. ముఖ్యమంతిర కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. తనను మరోసారి అఖండ మెజార్టీతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ముడుపుకట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని యస్వాడ, గోపాల్‌పూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, 'ప్రజలు.. సారూ.. కారూ.. కేసీఆర్ సర్కారు' అనే నినాదంతోనే ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలకే గ్యారెంటీ లేదని, ఇక ఆరు గ్యారంటీలకు గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఆ పార్టీ నాయకుడు కవ్వంపల్లి ఎక్కడున్నాడు? ఆయనకు అప్పుడు నియోజకవర్గ ప్రజలు గుర్తు రాలేదా..? అని ప్రశ్నించారు. కవ్వంపల్లికి ప్రజలపై ప్రేమ ఉంటే ఎందుకు ఉచితంగా వైద్యం చేయలేదని నిలదీశారు. ఎన్నికలు వస్తేనే ఆయన ఊర్లలోకి వచ్చి దొంగ మాటలు చెబుతాడని, వాటిని నమ్మి ఆగం కావొద్దని ప్రజలకు సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ తీసుకువచ్చిన మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ప్రతి దళిత కుటుంబానికి ₹10 లక్షల సాయం చేస్తామన్నారు. కులవృత్తులపై ఆధారపడిన బీసీలకు ₹లక్ష సాయం చేస్తున్నామని గుర్తు చేశారు. పారువెల్ల నుంచి వడ్లూరు గ్రామానికి రోడ్డు, చెరువు మత్తడిపై బ్రిడ్జి నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన యాదవ, పద్మశాలీ సంఘాల నాయకులు పలువురు, బీఎస్పీ నాయకులు, వీరపూర్ గ్రామానికి బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ప్రచారానికి వచ్చిన రసమయి బాలకిషన్‌కు ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. బొట్టుపెట్టి, మంగళహారతులు పట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, ఎంపీపీ మల్లారెడ్డి, సర్పంచ్ మోహన్ రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు బద్దం తిరుపతి రెడ్డి, మహేందర్, సురేశ్, రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానలో ఖరీదైన చికిత్స



అజీముద్దీన్‌తో ప్రభుత్వ వైద్య బృందం

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన ప్రభుత్వ వైద్యులు
- రూ. 8 లక్షల విలువైన చికిత్స ఉచితం

విద్యానగర్, అక్టోబర్ 30: కరీంనగర్ ముకరంపురకు చెందిన అజీముద్దీన్ (61) బీపీ, షుగర్, జాండీస్‌తో బాధపడుతున్నాడు. గత కొన్ని నెలల క్రితం బాత్‌రూంలో జారి పడడంతో తొంటి ఎముక విరిగింది. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. వెంటనే వైద్యులు పరీక్షించి శస్త్ర చికిత్స చేసి రాడ్ వేశారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లగానే తొంటి నుంచి చీము కారడం మొదలైంది. అజీముద్దీన్‌కు బీపీ, షుగర్‌తో పాటు జాండీస్ ఉండడంతో ఇన్ఫెక్షన్ ఎక్కువైంది. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్తే రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో చేసేదేం లేక కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. ప్రభుత్వ దవాఖాన ఆర్థోపెడిక్ సర్జన్ నారగోని కుమార్‌గౌడ్ అజీముద్దీన్‌ను పరీక్షించారు. ఎక్స్‌రేలో కమ్యూనిటెడ్ ఫ్రాక్చర్ ఆఫ్ ది ఐటి ఇంటర్ ట్రోకండరీ ఫ్రాక్చర్ ఆఫ్ రైట్ ఫీమర్ (నాలుగు ముక్కలుగా) అయినట్లుగా తేలింది. దీంతో పాటు కల్చర్ సెన్సివిటికి పంపిస్తే సిట్రో బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాటికి తగ్గట్టుగా హైయ్యర్ యాంటీ బయాటిక్స్ ఇంజక్షన్ రూపంలో టిజి సైక్లిన్ ఇవ్వడంతో పాటు ప్రతిరోజూ అర లీటర్ చీమును తొలగించారు. దీంతో రోజురోజుకూ ఇన్ఫెక్షన్ తగ్గుతూ వచ్చింది. 15 రోజుల తర్వాత కల్చర్ సెన్సివిటి నెగిటివ్‌గా రావడంతో పూర్తి స్థాయిలో శరీరంలో బ్యాక్టీరియా లేకపోవడంతో శస్త్ర చికిత్స చేశారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో మాత్రమే స్టెమిలాట్ విత్ యాంటీ బయాటిక్స్ అందుబాటులో ఉంటాయి. అలాంటిది అతి ఖరీదైన మందులను కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో అందించి చికిత్స చేయడంతో పాటు శస్త్ర చికిత్స చేసి మళ్లీ రాడ్ వేశారు. బీపీ అన్ కంట్రోల్ డయాబెటిక్, జాండీస్‌తో పాటు క్రానిక్ ఎనిమిక్ లాంటి కండీషన్‌లో ఉన్న అజీముద్దీన్‌కు ఇన్ఫెక్ట్ ఇంప్లాంట్ రిమూవల్ చేసి చీము పట్టిన రాడ్‌ను తొలగించి రాడ్ ఇరువైపులా కుళ్లిన మాంసాన్ని తీసివేయడం (ఊండ్ డీబ్రైడ్‌మెంట్)తో పాటు, స్ట్రీమ్లా, టీజీ సైక్లోన్ ఇంజక్షన్లు, యాంటీ బయాటిక్స్, బిట్స్, వాంకోమైసిన్ ప్రొసిజర్‌తో పూర్తి స్థాయిలో గాయం మానేందుకు వీలైందని వైద్యులు పేర్కొన్నారు. ఒక్కో యాంటీబయాటిక్ ఇంజక్షన్ ఖరీదు రూ.7వేలకు పైగా ఉండగా, అలాంటిది 15 రోజుల పాటు అందించడంతో పూర్తిగా కోలుకున్నాడు. రూ. 8లక్షల విలువైన వైద్యాన్ని రూపాయి ఖర్చు లేకుండా కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో అందించడంతో అజీముద్దీన్ కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందాన్ని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ అభినందించారు. వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్లు వంశీ, ఖదీర్, ధన్‌రాజ్, సర్జన్లు కుమారస్వామి, అనస్తిషియా చంద్రశేఖర్, అశోక్, రాజ్‌కుమార్, సైకియాట్రిస్ట్ వర్ని, ఫిజిషియన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, పల్మానాలజీ సతీశ్‌రావు ఎప్పటికప్పుడు అజీముద్దీన్‌ను పరీక్షిస్తున్నారు.

### 15 మోకాలు కీలు, 2 తొంటి కీలు మార్పిడి చేశాం



ప్రభుత్వ దవాఖానలో 15 మంది మోకాలు కీలు, ఒకరికి రెండు తొంటి కీలు మార్పిడి చేశాం. వీటికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అయితే రూ. 2 నుంచి 4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అలాంటిది తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నది. ఎప్పటికప్పుడు ప్రభుత్వ దవాఖానలో అవసరమైన వారికి కీళ్ల మార్పిడి చేస్తున్నాం. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే కొంతమంది ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో శస్త్ర చికిత్సలు చేసుకుని ప్రభుత్వ దవాఖానకు వస్తున్నారు. అలాంటి వారికి సైతం వైద్యం అందిస్తున్నాం.

*- కుమార్‌గౌడ్ నారగోని, ఆర్థోపెడిక్ సర్జన్*

### కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్యం



ప్రభుత్వ దవాఖానలో ప్రత్యేకంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రాలతో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ఖరీదైన మందులను అందుబాటులోకి తేవడంతో రోజుకు వెయ్యి మంది వరకు ఓపీతో పాటు ఐపీ సేవలు వినియోగించుకుంటున్నారు. వీటితో పాటు 120 రకాలుగా పైగా రక్త పరీక్షలు, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కాన్లు, అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ సిస్టమ్‌లో వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వ వైద్యంపై పేద ప్రజలకు నమ్మకం కలగడంతో ప్రసవాల సంఖ్య సైతం గతంతో పోల్చితే నాలుగింతలు అయింది.

*- డాక్టర్ కృష్ణప్రసాద్, దవాఖాన సూపరింటెండెంట్*

# కాంగ్రెస్ టికెట్లు అమ్ముకుంటోంది

- అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్న
- కొత్త జైపాల్ రెడ్డి వెల్లడి

కరీంనగర్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ నాయకుడు, గంగాధర సింగిల్ విండో మాజీ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి మంగళవారం భారత రాష్ట్ర సమితిలో చేరనున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ఆయనే స్వయంగా ధ్రువీకరించారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న ఆయన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించారు. కానీ.. కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం జరుగుతున్న గొడవలు, డబ్బుల వసూళ్ల పర్వం గురించి తెలుసుకున్న ఆయన, పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై కొత్త జైపాల్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్లు అమ్ముకుంటున్నారని తెలిపారు. సర్వేల పేరిట అభ్యర్థులకు ఆశలు చూపడం.. ఆ తదుపరి బేరసారాలు జరపడం.. అందులో తేడాలు వస్తే వారిని పక్కన పెట్టడం జరుగుతుందన్నారు. నిజానికి సర్వేల ప్రకారం గెలిచే అభ్యర్థులకు టికెట్లు ఇవ్వాలని, కానీ అలా కాకుండా.. బేరసారాలు చేసి డబ్బులు ముట్టజెప్పిన వారికే టికెట్లు ఇస్తున్నదని విమర్శించారు. టికెట్ల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం బయటపడిందన్నారు. అందుకే ఆ పార్టీలో చాలా మంది ఇముడ లేకపోతున్నారని తెలిపారు. పార్టీని వీడేందుకు టికెట్ల వ్యవహారంలో జరుగుతున్న ముడుపుల వ్యవహారం ఒక కారణం అయితే.. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి ప్రధాన కారణమన్నారు. నిజానికి గడిచిన తొమ్మిదేళ్లలో దేశంలో ఏ రాష్ట్రం సాధించనంత ప్రగతిని ముఖ్యమంత్రి సాధించారని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఏదో ఒక పథకం ద్వారా ఫలాలు అందని కుటుంబాలు లేవన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుల సంక్షేమాన్ని విస్మరించడమే కాదు.. ఉచిత విద్యుత్ ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం చూపుతున్నాయని, నిన్న గాక మొన్న గెలిచిన కర్ణాటక రాష్ట్రంలో పట్టుమని ఐదు గంటలు కూడా వ్యవసాయనికి కరెంటు ఇవ్వడం లేదని, అదే తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇదొక్కటే కాదు. ఏ రంగంలో చూసినా కేసీఆర్ సారథ్యంలో.. రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని, అందుకే కాంగ్రెస్‌ను వీడి మంగళవారం తన అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

### స్వచ్ఛంద కార్యక్రమాలు

మైత్రి గ్రూప్ చైర్మన్‌గా కొనసాగుతున్న కొత్త జైపాల్‌రెడ్డి కరీంనగర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల్లో వివిధ రకాల స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటు వ్యాపారవేత్తగా, అటు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టే సేవకుడిగా కొనసాగుతున్న ఆయనకు ఈ రెండు నియోజకవర్గాల్లోని చాలా వర్గాలతో సన్నిహిత సంబంధాలున్నాయి. వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో మంచి ఆదరణ పొందిన కొత్త జైపాల్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి చేర్చుకోవడాన్ని అన్ని వర్గాలు హర్షిస్తున్నాయి. గంగాధర సింగిల్ విండో చైర్మన్‌గా గతంలో పని వేసిన కొత్త జైపాల్ రెడ్డి టీడీపీలోనూ సీనియర్ నాయకుడిగా, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత వ్యాపార, వాణిజ్య రంగాల్లో కొనసాగుతూనే పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పేదలకు అండగా నిలుస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందుతున్నారు. బీఆర్ఎస్‌లో చేరడం వల్ల కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు బలం కలిసి వచ్చే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలు, పారడైజ్ విద్యాసంస్థల అధినేత ఫాతిమారెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

# మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

- రాష్ట్రంలో వారి పేర్లతోనే అనేక పథకాలు అమలు చేస్తున్నాం
- రాష్ట్ర మంతి గంగుల కమలాకర్
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరికలు

కార్పొరేషన్, అక్టోబర్ 30: బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను కూడా మహిళల పేరుతోనే అమలు చేస్తున్నామని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని దుర్శేడ్, బొమ్మకల్, శాంతినగర్‌కు చెందిన పలువురు మహిళలు సోమవారం బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సంతోషి ఆధ్వర్యంలో మంత్రి కార్యాలయంలో మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గంగుల గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య సంరక్షణకు కూడా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు సూర్యశేఖర్ పాల్గొనగా, పార్టీలో చేరిన వారిలో పద్మ, జానకీ, సంధ్య, ప్రణిత, అనిత తదితరులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌లోకి పారడైస్ విద్యా సంస్థల అధినేత

నగరంలోని రేకుర్తిలోని సెయింట్ జార్జ్, పారడైస్ విద్యాసంస్థల అధినేత ఫాతిమారెడ్డి సోమవారం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. విద్యాసంస్థల ప్రతినిధులు పార్టీలోకి రావడం అభినందనీయం మంత్రి అన్నారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, నాయకులు నందెల్లి మహిపాల్, గన్నాల రమేశ్, సిరిపురం శ్రీకాంత్, సుంకె సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.